గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే

మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నస్పూర్, డిసెంబరు 12 : జిల్లాలో ఈ నెల 15, 16 తేదీల్లో గ్రూప్ -2 పరీక్షను సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. జిల్లాలో పరీక్ష నిర్వహణకు 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 14,951 మంది పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. నోడల్ అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, పోలీసు నోడల్ అధికారిగా బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ సుందర్, రీజియన్ కో ఆర్డినేటర్‌గా బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్‌రెడ్డిని నియమించినట్లు వెల్లడించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య , పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఉదయం 8.30 గంటలు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు గేట్లు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 12: ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లాలో జరగనున్న గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ ఎం. డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు, పరీక్షల పరిశీలకులు, రూట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటిఫికేషన్ అధికారులు, ఆర్టీసీ, వైద్య, విద్యుత్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో పరీక్షలు నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-2 పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షల దృష్ట్యా జిల్లాలోని 18 పరీక్ష కేంద్రాల వద్ద ఈ నెల 15వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 16వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమలు చేయనున్నామని, పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు 5 మందికి మించి గుంపులుగా ఉండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలు ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించవద్దని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదనపు కలెక్టర్, నోడల్ అధికారి మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-2 పరీక్షల పేపర్లు జిల్లాకు చేరుకున్నాయని, వాటిని పటిష్ట బందోబస్తు మధ్య జిల్లా ఖజానా కార్యాలయంలో భద్రపర్చినట్లు తెలిపారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో పరిరక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనరసింహ, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కూతురిని చూపించడం లేదని తండ్రి ఆత్మహత్యాయత్నం

బెల్లంపల్లి, డిసెంబర్ 12 :తన కూతురిని భార్య చూపించడం లేదని టేకులబస్తీకి చెందిన బొల్లి సుమిత్‌చంద్ర గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..2001లో సుమిత్ చంద్రకు బూడిదగడ్డబస్తీకి చెందిన శిరీషతో వివాహం జరిగింది. వీరికి పాప జన్మించిన తర్వాత కుటుంబ కలహాలు జరిగాయి. ఈ క్రమంలో శిరీష 2003లో భర్తపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వీరిద్దరూ కోర్టు వాయిదాలకు హాజరవుతున్నారు. సుమిత్ చంద్రకు రెండేళ్లుగా భార్య దగ్గర ఉంటున్న తన కూతురును చేసే అవకాశం ఇవ్వలేదు. గురువారం కోర్టు వాయిదాకు వచ్చిన సుమిత్ చంద్ర కూతురును చూపించాలని భార్యతో గొడవకు దిగాడు. ఆమె తాళ్లగురిజాల పోలీసులను ఆశ్రయించింది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన అప్పటికే వెంట తెచ్చుకున్న హెయిర్ డైని పోలీస్‌స్టేషన్ ముందే తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు అతడిని ప్రభుత్వ దవాఖానకు తరలించి వైద్యం అందిస్తున్నారు.

ఐరన్ డోర్లను పట్టుకున్న సింగరేణి ఎస్అండ్‌పీసీ

తాండూర్/రెబ్బెన, డిసెంబర్ 12 : తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లోని సింగరేణి క్వార్టర్ల ఐరన్ డోర్లను తొలగించి స్క్రాప్‌కు తరలిస్తుండగా సింగరేణి ఎస్అండ్‌పీసీ జమేదార్ దశరథం పటేల్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎస్అండ్‌పీసీ సిబ్బందితో కలిసి మాదారంలో తనిఖీ చేశారు. ఆటో లో ఐరన్ డోర్‌ను తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకున్నారు. దాని విలువ సుమారు రూ.10 వేలు ఉంటుందన్నారు. పట్టుకున్న సామగ్రి, ఆటోను గోలేటి 1-ఇంక్లైన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో తపాన్ మండేల్, గొర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ప్రవేశాలకు గడువు పెంపు

దండేపల్లి, డిసెంబర్12: 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రత్యేక ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 16 వరకు గడువు పొడిగించినట్లు దండేపల్లి ఉన్నత పాఠశాల సమన్వయకర్త ఎన్.శ్రీనివాస్, సహాయ సమన్వయకర్త సంగర్ష్ రాజేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇదే చివరి అవకాశం అని ప్రవేశం పొందే అభ్యాసకులు వారి వారి నిజ ధృవీకరణ పత్రాలతో పాఠశాలలో సంప్రదించాలన్నారు.ప్రవేశ రుసుమును మీసేవా, ఆన్లైన్ కేంద్రాలలో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు చరవాణి 8309769067ను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్యమందించాలి

కన్నెపల్లి, డిసెంబర్ 12 : ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలందించాలని ప్రగతి శీల యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో అన్ని రకాల మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ప్రైవేట్ దవాఖానలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, మెడికల్ షాపుల్లో అధిక ధరలకు మందులు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వరి విత్తనాల పంపిణీ

దండేపల్లి, డిసెంబర్12 : దండేపల్లిలోని ఏవో కార్యాలయ ఆవరణలో గురువారం వ్యవసాయాధికారులు వరి విత్తనాలను సరఫరా చేశారు. జాతీయ ఆహార భద్రత మిషన్ 2024-25 పథకంలో భాగంగా యాసంగి పంటలకు సంబంధించి వరిలో క్లస్టర్ క్షేత్ర ప్రదర్శన కింద కూనారం 1638 వరి రకాన్ని డెమో రూపేణా విత్తనాలు ఎంపిక చేసిన రైతులకు 125 ఎకరాల్లో సరఫరా చేశారు. మండలానికి 25 క్వింటాళ్లు 50శాతం రాయితీ విత్తనాన్ని కేటాయించినట్లు తెలిపారు. 15 కిలోల బ్యాగు ధర రూ.303 అని, కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్ బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌ను సంబంధిత వ్యవసాయ విస్తీరణ అధికారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల వ్యవసాయ సంచాలకులు ప్రసాద్, ఏవో అంజిత్‌కుమార్, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

జాతీయ మహాసభల పోస్టర్లు విడుదల

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 12: అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం జాతీయ రెండో మహాసభల పోస్టర్లను గురువారం మంచిర్యాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న మాట్లాడుతూ దళితుల సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ కోసం జనవరి 5 నుంచి 7వ తేదీ వరకు హైదరాబాద్‌లో అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం రెండో జాతీయ మహాసభలను నిర్వహించనున్నామని ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మారపెల్లి రవి, నాయకులు నక్క వెంకటస్వామి, మొగిలి, లక్ష్మణ్, పొనగంటి ఏసేపు, మామిడి గోపి, రామ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

దండేపల్లి, డిసెంబర్12: దండేపల్లి మండలంలోని కాసిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఫుడ్ పెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులంతా తమ ఇండ్ల నుంచి వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం విజయలక్ష్మి, హెచ్ఎం సులేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎన్జీవో సభ్యత్వ నమోదు

హాజీపూర్, డిసెంబర్ 3: జిల్లాలోని ప్రతి నాన్ గెజిటెడ్ ఉద్యోగి టీఎన్జీవోలో సభ్యత్వం తీసుకోవాలని టీఎన్జీవో కేంద్ర సంఘం సలహాదారు సంద అశోక్ సూచించారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఐటీఐ కార్యాలయంలో టీఎన్జీఓ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, భూముల రామ్మోహన్, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, అనుమల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికార సమితిలో నియామకాలు

మంచిర్యాల (ఏసీసీ), డిసెంబర్ 12: జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితిలో పలు నియామకాలు జరిగాయి. చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆవిడపు గణేశ్, జిల్లా యువజన కో కన్వీనర్‌గా పెద్దల చంద్రకాంత్‌ను నియమించారు. బీసీ జనగణన, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి మనోహర్, వేముల మల్లేశ్, ఆవిడపు శ్రీనివాస్, పోషం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా అట్కపురం రమేశ్

అట్కపురం రమేశ్

కాసిపేట, డిసెంబర్ 12 : తెలంగాణ ఆల్ ఇండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా కాసిపేట మండలంలోని దేవాపూర్‌కు చెందిన అట్కపురం రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొత్త విజయ్ భాస్కర్ జిల్లా అధ్యక్షుడిగా అట్కపురం రమేశ్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర నాయకులకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపాడు.

తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవీందర్

మండిగ రవీందర్

తాండూర్, డిసెంబర్ 12 : ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండిగ రవీందర్‌ను గురువారం గాంధారి వనం వద్ద సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

కాసిపేట, డిసెంబర్ 12 : కాసిపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2వ సాధారణ ఎన్నికలు 2024 భాగంగా గురువారం గ్రామపంచాయతీల వారీగా డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా అభ్యంతరాలపై రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సప్దర్ అలీ, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీ నారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, ఆయా పార్టీల అధ్యక్షులు రత్నం ప్రదీప్, సూరం సంపత్ కుమార్, నాయకులు రాంటెంకి వాస్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి, డిసెంబర్ 12 : గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లలో అభ్యంతరాలపై కోటపల్లి ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సిర్సాలో పోలింగ్ కేంద్రాలను మార్పు చేయాలని ఎంపీడీవో లక్ష్మయ్యకు బీజేపీ నాయకులు పెద్దింటి పున్నంచంద్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేశ్ ప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎరినాగుల ఓదెలు, నాయకులు కొట్టె నారాయణ, నీల మనోహర్, రాళ్లబండి శ్యామ్, విశాల్ పాల్గొన్నారు.

అన్నదానం చేయడం అభినందనీయం

బెల్లంపల్లి, డిసెంబర్ 12 : ప్రతి వారం నిర్విరామంగా అన్నదానం చేయడం అభినందనీయమని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. జన హిత సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతివారం చేస్తున్న అన్నదానం గురువారం 300వ సారికి చేరుకున్నది. ఈ కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వంట మాస్టర్ నిచ్చకోల గురుస్వామిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీశ్, సభ్యులు విజయ్‌కుమార్, రవి, రమాదేవి, బాలాజీ, రమేశ్, నగేశ్, సుకుమార్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీవశాస్త్రంలో ప్రతిభ

జన్నారం, డిసెంబర్ 12 :మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ గురువారం మండల స్థాయి జీవశాస్త్ర టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈవో నడిమెట్ల విజయ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ఇంగ్లిష్ మీడియంలో ఎస్‌కే అశ్వర్(ప్రథమ)కలమడుగు, ఎం అంజన్ (ద్వితీయ)కలమడుగు, తెలుగు మీడియంలో కొత్త అనిల్(ప్రథమ)కిష్టాపూర్, విష్ణువర్ధన్(ద్వితీయ)కిష్టాపూర్ పాఠశాలకు చెందిని విద్యార్థులు బహుమతులు అందుకున్నారు.

నేడు క్రికెట్ అకాడమీ ప్రారంభం

బెల్లంపల్లి, డిసెంబర్ 12 :పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీని శుక్రవారం ప్రారంభించనున్నారు. సబ్ జూనియర్ స్థాయి నుంచి సీనియర్ స్థాయి వరకు అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.

సకాలంలో బియ్యం సరఫరా చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 12: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు నిర్ణీత గడువు లోగా బియ్యాన్ని సరఫరా చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎంఎల్ఎస్. పాయింట్‌ను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్‌తో కలిసి సందర్శించి బియ్యం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎం ఎల్ ఎస్ పాయింట్ నుంచి కేటాయించిన ప్రకారంగా పాఠశాలలు, గురుకులాలు, అంగన్‌వాడీలకు నిర్ణీత సమయంలో బియ్యం సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. అనుమతిలేని వాహనాల ద్వారా సరుకులు సరఫరా చేయకూడదని, టెండర్‌లో పేర్కొన్న వాహనాలను మాత్రమే వినియోగించాలని, ఈ వాహనాలకు జీపీఎస్. ట్యాగ్ చేయాలని తెలిపారు. పాఠశాలలకు నాణ్యత గల బియ్యంలో సరఫరా చేయాలని, బియ్యం లోడుతో వెళ్లే వాహనం దారి మధ్యలో ఎక్కడ ఆగకుండా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. కలెక్టర్ వెంట డీఎం. కార్పొరేషన్ వెంకట్ నర్సింహ, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎం.ఎల్ఎస్. పాయింట్ ఇన్‌చార్జి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

జిల్లాలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం డేవిడ్‌తో కలిసి అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో కొనసాగుతున్న పాఠశాలలు, వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులు, వార్డెన్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల ఉపసంచాలకులు సజీవన్, జిల్లా విద్యాధికారి ఉదయ్ బాబు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, వసతి గృహాల సంక్షేమ అధికారులు తదితరులున్నారు.

పాత కార్మికులనే విధుల్లోకి తీసుకోవాలి

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 12: శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఆర్వో వాటర్ ప్లాంట్ టెండర్ పిలిచి పాత కార్మికుల్ని కొనసాగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన శ్రీరాంపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో కార్మికులకు, అధికారులకు శుద్ధజలాలు అందించడానికి యాజమాన్యం ఏరియాలోని కృష్ణాకాలనీ, నస్పూర్‌కాలనీల్లో మూడు ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని, వాటర్ సప్లైగా పనిచేసేందుకు టెండర్ ద్వారా కాంట్రాక్ట్ కార్మికులను తీసుకున్నట్లు తెలిపారు. టెండర్ గడువు ముగిసి 7 నెలలవుతున్నా, ఇప్పటి వరకు కొత్త టెండర్‌ను పిలవకుండా పాత కార్మికులకు పని కల్పించడం లేదన్నారు. సివిల్ డీజీఎం స్పందించి పాత కార్మికులను విధులకు తీసుకోవాలన్నారు.

దస్నాపూర్ చెరువు హద్దుల పరిశీలన

చెరువు హద్దులను పరిశీలిస్తున్న ఏడీ

వేమనపల్లి, డిసెంబరు 12 : దస్నాపూర్ గ్రామ శివారులోని సర్వే నంబరు 20లోని చెరువును గురువారం జిల్లా భూముల కొలతల ఏడీ శ్రీనివాస్ పరిశీలించారు. రెండు సంవత్సరాల నుంచి ఈ చెరువు భూమి 20 ఎకరాల వరకు కబ్జా చేశారని ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు రమేశ్, సిడాం శ్యామ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో ఏడీ చెరువు వద్దకు వచ్చి హద్దులను పరిశీలించారు. చెరువు భూమిని అక్రమంగా కబ్జా చేసిన వారికి నోటీసులు జారీ చేసి చెరువు పూర్తి భూమిని స్వాధీనం చేసుకుంటామని ఏడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు

తాండూర్, డిసెంబర్ 12 : తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం రాత్రి కాపువాడ, ఎన్టీఆర్ కాలనీలో బోధకాలు వ్యాధి నిర్ధారణకు 306 మంది రక్త నమూనాలు సేకరించినట్లు తాండూర్ పీహెచ్‌సీ వైద్యురాలు ఝాన్సీరాణి తెలిపారు.

కోటపల్లి, డిసెంబర్ 12 : కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలకేంద్రంలో బుధవారం రాత్రి 300 మంది నుంచి రక్త నమూనాలను సేకరించినట్లు వైద్యాధికారిణి అరుణశ్రీ తెలిపారు.

నర్సరీల పరిశీలన

కాసిపేట, డిసెంబర్ 12 : మండలంలోని లంబాడీతండా(కే), సోమగూడెం(కే) నర్సరీలను డీఆర్డీవో కిషన్ పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. కోనూర్‌లో పశువుల పాక, కాంపోస్ట్ పిట్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నవీన్ కుమార్, ఈసీ మల్లేశ్, టీఏలు అనూష, వినోద్ కుమార్, శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి

అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ టౌన్,డిసెంబర్ 12: రాష్ట్రస్థాయిలో క్రీడాకారులు ప్రతిభ చాటాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో మున్సిపల్ స్థాయి సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండల, మున్సిపల్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి, ఆ తర్వాత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుభాష్, మున్సిపల్ కమిషనర్ భుజంగ రావు, గిరిజన క్రీడల అధికారి మీనా రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల విజేతలకు బహుమతులు అందజేత

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 12 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్)ఆధ్వర్యంలో సీఎం కప్-2024 లో భాగంగా మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో క్రీడా పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు బహుమతులు అందజేశారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

బెల్లంపల్లి, డిసెంబర్ 12 : దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందికి డీసీహెచ్ఎస్ కోటేశ్వర్‌రావు సూచించారు. గురువారం బెల్లంపల్లిలోని వంద పడకల దవాఖానను ఆయన తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ జీ.రవి, నర్సింగ్ సూపరింటెండెంట్ జోసెఫిణి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో లోడింగ్ అన్‌లోడింగ్ కార్మికుడి మృతి

శ్రీరాంపూర్, డిసెంబర్ 12 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7 కాంటా సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోల్ లోడింగ్ అన్ లోడింగ్ టార్పాలిన్ కార్మికుడు మండ వైకుంఠం (70) మృతి చెందాడు. వైకుంఠం విధులు ముగించుకొని రాత్రి 11 గంటలకు ఇంటికి వస్తుండగా ఎదురుగా రమేశ్ మోటార్ సైకిల్‌పై వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వైకుంఠం తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ పేర్కొన్నారు. వైకుంఠం భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వైకుంఠం శ్రీరాంపూర్ ఏరియా కోల్ లారీ లోడింగ్ అన్ లోడింగ్ లెవలింగ్ టార్పాలిన్ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. ఆయన మృతిపై సంఘం అధ్యక్షుడు వీ మల్లయ్య, ప్రధాన కార్యదర్శి బీరయ్య, సహాయ కార్యదర్శి బొద్దున రాజేశం సంతాపం తెలిపారు.

రైలు నుంచి జారి పడి ఒకరి మృతి

మంచిర్యాల (ఏసీసీ), డిసెంబర్ 12: ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి పడి యువకుడు మృతి చెందాడు. జీఆర్పీ మంచిర్యాల ఎస్ఐ మహేందర్ కథనం ప్రకారం.. బీహార్‌లోని మరీచా గ్రామానికి చెందిన అజిత్ కుమార్ (26) చెన్నై నుంచి న్యూఢిల్లీ వెళ్తున్న తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా రవీంద్రఖని స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తూ కింద పడి మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో నగల చోరీ

మంచిర్యాల (ఏసీసీ), డిసెంబర్ 12: పెళ్లికి వెళ్లి తిరిగివస్తుండగా బస్సులో ఏడు తులాల నగలు చోరీకి గురైన ఘటన మంచిర్యాల బస్టాండ్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సోమగూడెనికి చెందిన కోదాటి పద్మ బంధువుల పెళ్లి నిమిత్తం ఆటోలో మంచిర్యాల బస్టాండ్‌కు చేరుకున్నది. అక్కడి నుంచి కరీంనగర్ వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కి కూర్చోగా బ్యాగ్ కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించింది. అందులో రూ.1.40 లక్షల విలువైన ఏడు తులాల బంగారు నగలు, 1500 విలువ గల వెండి పట్టీలున్నాయని వాపోయింది. మంచిర్యాల ఎస్ఐ ప్రవీణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

తాండూర్, డిసెంబర్ 12 : మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు ఘనంగా అయ్యప్ప పడి పూజ కార్యక్రమం నిర్వహించారు. సూర్య భాష్కర శర్మ, సాయికిరణ్ శర్మ గురుస్వాముల నేతృత్వంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములకు తీర్థ ప్రసాదాలు, అల్పాహారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అయ్యప్పకు అభిషేక పూజలు నిర్వహిస్తున్న స్వాములు

హామీలు గాలికి వదిలిన కాంగ్రెస్ సర్కార్

- వంద కోట్లతో ఎక్కడ అభివృద్ధి చేశారో శ్వేత పత్రాన్ని ఎమ్మెల్యే విడుదల చేయాలి
- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

చింతలమానేపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చింతలమానేపల్లి, డిసెంబర్ 12: హామీలను అమలు చేయడంలో అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. చింతలమానేపల్లి మండలంలో గురువారంఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని గాలి కొదిలేశారని, ఎప్పుడు నెరవేరుస్తారో సిర్పూర్ ప్రజలకి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి 100 రోజుల్లో 100 కోట్లు తీసుకొచ్చాను అని గొప్పలు చెప్పుకునే ఎమ్మెల్యే హరీశ్‌బాబు వాటితో ఎక్కడ అభివృద్ధి పనులు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. కర్జెల్లి నుంచి గూడెం వరకు రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చి మరిచారని రోడ్డు పనులు చేపట్టకపోతే ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దిందా వాగుపైన వంతెన నిర్మాణ పనులు చేపట్టాలనిన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా సీఎం రేవంతర్‌రెడ్డి మాటలతో గారడి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోమాసి లహంచు, యూత్ అధ్యక్షుడు బండ శేఖర్, ఉపాధ్యక్షుడు భాస్కర్, మండల నాయకులు రాంటెంకి నవీన్, మున్నా, విలాస్, సంతోష్, సంజీవ్, ప్రభాకర్, వెంకటేశ్, కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

3 రోజులపాటు పత్తి కొనుగోళ్లు బంద్

జైనూర్, డిసెంబర్ 12 :మూడు రోజులపాటు సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు జైనూర్ మార్కెట్ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిన్నింగ్ మిల్లులో పత్తి అధిక నిల్వ ఉండడంతో శుక్రవారం, శనివారం, ఆదివారం పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. తిరిగి సోమవారం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు గమనించాలని ఆయన కోరారు.

రక్తదానం చేయడం అభినందనీయం

రక్తదానం చేసిన పెందోర్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న నాయకులు

కెరమెరి, డిసెంబర్ 12: బీఆర్ఎస్ నాయకుడు, కెరమెరి మండల మాజీ వైస్ ఎంపీపీ సయ్యద్ అబుల్ కలాం జన్మదినం సందర్భంగా యువకులు చేసిన రక్తదానం అభినందనీయమని మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో అబ్దుల్ కలాం యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల నాయకులతో పాటు యువకులు చేసిన రక్తదానం ఎంతో మందికి ప్రాణదానంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అబూల్ కలాం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెందోర్ ఆనంద్‌రావ్, మాజీ ఉప సర్పంచ్ సయ్యద్ రిజ్వాన్, నాయకులు కుమ్రం భీంరావ్, శేష రావ్ యునుస్, రఘునాథ్, కంబాల వినేశ్, పెందోర్ శ్రీనివాస్, రాథోడ్ గోపాల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో సమావేశం

బెజ్జూర్, డిసెంబర్ 12 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో గౌరి శంకర్ మండల అఖిల పక్ష రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు తెలుసుకున్నారు.

కాగజ్‌నగర్, డిసెంబర్ 12: ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లు, ఓటరు జాబిత వివరాలు వెల్లడించినట్లు తెలిపారు.

పెంచికల్ పేట్, డిసెంబర్ 12 : ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆల్బర్ట్ వివిధ రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిట్టు శ్రీనివాస్, బీజేపీ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మధుకర్, బోయిన బండన్న తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

చింతలమానేపల్లి,డిసెంబర్ 12ః మండల టీఎస్ యూటిఎఫ్ కార్యవర్గాన్ని గురువారం జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందు రావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బుర్ర మహేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా విఘ్నేశ్, ఉపాధ్యక్షుడిగా రాకేశ్, శ్రీదేవి, కోశాధికారిగా రవికుమార్, కార్యదర్శులుగా రాజన్న, విశ్వనాథ్, సచిన్,పార్వతి, కార్యవర్గ సభ్యులుగా రాజేందర్, కిరణ్‌కుమార్, కళ్యాణ్, రఘుపతి, రవికుమార్, స్నేహలత, వంశీ, తిరుపతి, శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

యూటీఎఫ్ కౌటాల మండల కమిటీ

కౌటాల, డిసెంబర్ 12 : టీఎస్ యూటీఎఫ్ కౌటాల మండల కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా రావుల వినోద్, ప్రధాన కార్యదర్శిగా సుగుణాకర్, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, ఉపాధ్యక్షురాలిగా శిరీష, కోశాధికారిగా రావూజీ, కార్యదర్శులుగా కృష్ణమూర్తి, కృష్ణ, ప్రవళిక, రాకేశ్, జిల్లా మహాసభ ప్రతినిధులుగా అంటోని, ధర్మయ్య, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు

పెంచికల్ పేట్, డిసెంబర్ 13 తల్లిదండ్రులు బాల్య వివాలను ప్రోత్సహించవద్దని బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ కొమురయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.బాల్యవివాహాలు అరికట్టాలని ఉద్దేశ్యంతోనే 'కల్యాణ లక్ష్మి' 'షాదీ ముబారక్' లాంటి పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 లేదా డయల్ 100 కి ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

ప్రజలను అధోగతి పాలు చేసిన కాంగ్రెస్

రెబ్బెన, డిసెంబర్ 12: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 66 మోసాలు చేసి ప్రజలను అధోగతి పాలు చేశారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్ అన్నారు. మండలంలోని నంబాల గ్రామ పంచాయతీలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పింఛన్ పెంచామని, కల్యాణలక్ష్మి సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని మోసం చేసిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ సోల్లు లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు గులబం చక్రపాణి, తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677